క్లుప్తంగా

ఇంటివద్ద పింఛన్ అందించాలి

ములుగు రూరల్ : వృద్ధులకు, నడవలేని దివ్యాంగులకు పెన్షన్ ఇంటి వద్ద అందజేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులు పింఛన్ కోసం ఆటో కిరాయిలు తీసుకొని కుటుంబ సభ్యులు పనిమానుకొని రావల్సి వస్తుందని అన్నారు. అధికారులు నడవలేని వారికి ఇంటి వద్ద పింఛన్ అందజేయాలని కోరారు.

ఎమ్మెల్యే ఫండ్ నుంచి విద్యుత్ లైన్‌కు నిధులు



విద్యుత్ లైన్ కోసం స్తంభాలు వేయిస్తున్న అధికారులు

వాజేడు : మండల పరిధిలోని పెనుగోలు కాలనీలో లైన్ పొడిగింపు కోసం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తన ఫండ్ నుంచి రూ.4 లక్షల నిధులను మంజూరు చేసినట్లు కాంగ్రెస్ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్, ఏఈ అర్షద్ అహ్మద్ తెలిపారు. గ్రామంలో విద్యుత్ లైన్ పెంచడానికి 25 విద్యుత్ స్తంభాలు అవసరం కాగా ఆ పనులను శుక్రవారం నుంచి విద్యుత్‌శాఖ అధికారులు ప్రారంభించారు. రెండు రోజుల్లో ఈ పనులను పూర్తి చేసి విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తామని ఏఈ వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు విశ్వనాథ ప్రసాదరాజు, సొసైటీ ఉపాధ్యక్షుడు జగన్నాథరాజు, ఆదినారాయణ, సంజీవ, నానబాబు, రామకృష్ణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాక్షికంగా కూలిన ఇల్లు



వాజేడు : మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన తొర్రెం కాంతారావు ఇల్లు పాక్షికంగా కూలింది. విషయం తెలుసుకున్న ఏడ్జర్లపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ అక్కడి వెళ్లి పరిశీలించినట్లు ఆర్ఐ కుమారస్వామి తెలిపారు. ఈ మధ్య కురిసిన వర్షాలకు ఇల్లు పాక్షికంగా కూలినట్లు వెల్లడించారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి భాస్కర్

వెంకటాపురం(కె) : కాచి చలార్చిన నీటినే తాగాలని వైద్యాధికారి భాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామచంద్రాపురం, ఆలుబాక గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు.గ్రామంలోని ఇంటింటికి వెళ్లి వైద్య సిబ్బంది ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవ్వాలిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ కోటిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఏఎన్ఎం ధనలక్ష్మి ఉన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



వెంకటాపురం(కె): నిత్యావసర వస్తువులు, సిమెంట్ మెడిసిన్ ఇన్సూరెన్స్ తదితర వస్తువులపై జీఎస్టీ తగ్గించడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్ర పటానికి మండల బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు రామెళ్ల రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం ప్రధాన మంత్రి నరేంద్ర మోడి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ బోల్లే సునీల్, మండల ప్రధాన కార్యదర్శి సాధనపల్లి విజయ్ కుమార్, నాయకులు సతీశ్, ఈశ్వరావు, కిషన్, శ్రీను, దుర్గ, రాజు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణపయ్య

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నవరాత్రులు ముగించుకొని నిమజ్జనం గంగమ్మ ఒడికి గణనాథులు ఊరేగింపుగా బయలుదేరారు. శుక్రవారం మండల కేంద్రాల్లో కోలాటం ఆడుతూ మహిళలు ఊరేగించారు. గణనాథుడిని ప్రత్యేకంగా తయారు చేసిన రథంలో వినాయకులను ఊరేగించారు. డీజే పాటలతో నృత్యాలు చేశారు. అనంతరం ముళ్లకట్ట వద్ద నిమజ్జనం చేసేందుకు ప్రత్యేక క్రేన్‌లను ఏర్పాటు చేశారు. పట్టణ పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. క్రేన్‌ల ద్వారా వినా యకుడి నిమజ్జన కార్యక్రమాన్ని జరిపించేందుకు ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ శ్రీనివాస్, ఎస్సైలు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. జైబోలో గణేశ్ మహా రాజ్‌కీ జై అంటూ భక్తుల నినాదాలు, యువతీ యువకుల కేరింతలు, నృత్యాలు, బాణసంచా మోతలు, డీజే పాటలతో గ్రామాలు దద్దరిల్లాయి. – సాక్షి, నెట్‌వర్క్



ఏటూరునాగారం: వినాయకుడి ఊరేగింపులో పాల్గొన్న కమిటీ సభ్యులు, మహిళలు



గోవిందరావుపేట : చల్వాయిలో ఊరేగింపుగా వెళ్తున్న వినాయక విగ్రహాలు



ములుగు రూరల్ : శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు



ఏటూరునాగారం : శోభాయాత్రలో రంగులు చల్లుకుంటున్న భక్తులు



కన్నాయిగూడెం : బుట్టాయిగూడెం వద్ద ఊరేగింపుగా బయలుదేరిన గణనాథుడు



వాజేడు : వినాయక విగ్రహాన్ని క్రేన్ సహాయంతో నిమజ్జనం చేస్తున్న అధికారులు



ఎస్ఎస్‌తాడ్వాయిలో..



మంగపేట: నృత్యం చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో పూజలు



మంగపేట: పాతూరులో లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న ఉత్సవకమిటీ సభ్యులు



వెంకటాపురం (కె) : పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న తహసీల్దార్ వేణుగోపాల్

మంగపేట: మండలంలో వినాయకుడి నవరాత్రి చివరి రోజు సందర్భంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో శుక్రవారం పూజలు నిర్వహించారు. కమలాపురంలోని పాతూరులోని వినాయక మండపం వద్ద ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు శ్రీ లక్ష్మీగణపతి హోమం పూజలు, భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్, ఆటోస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన మండపం వద్ద మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని వైజంక్షన్ వద్ద సమ్మక్క–సారలమ్మ యూత్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వినాయకుడి వద్ద 16 కిలోల (లడ్డు) ప్రసాదం కోసం ఎస్సై టీవీఆర్ సూరి చేతుల మీదుగా లక్కీ డ్రాను తీయగా గోనె మధుసూదన్‌రావు దక్కించుకున్నాడు. అదే విధంగా గంపోనిగూడెంలోని వినా యక మండపం వద్ద గణేష్‌లడ్డు ప్రసాదం వేలం పాట నిర్వహించగా బత్తిని శ్రీనివాస్‌గౌడ్ రూ 42,116లకు దక్కించుకున్నారు. కమలాపురంలోని ఇందిరానగర్‌లో గుంత శ్రీనివాస్ దంపతులు గణేష్ లడ్డును రూ 35,116, కలశం పాటను రూ 20,116కు వడ్లకొండ నరేష్,పట్టువస్త్రాలను మారం దేవేందర్‌రెడ్డి దంపతులు రూ.5,816కు దక్కించుకున్నారు.

వేడుకల్లో తహసీల్దార్ పూజలు

వెంకటాపురం(కె) : గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం స్థానికం జక్కులవారి వీధిలో తహసీల్దార్ వేణుగోపాల్ పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి లడ్డూ, కలశం వేలం పాట నిర్వహించారు. లడ్డు వేలంను బాలసాని అశ్వపతి రూ.50 వేలలకు దక్కించుకోగా, కలశంను బద్ది వీరన్న రూ.40,500 దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, సునీల్, శ్యామ్, శ్రీను, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

పింఛన్ల పెంపులో ప్రభుత్వం జాప్యం



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లూరి కరుణాకర్

ఎస్ఎస్‌తాడ్వాయి: వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగుల పింఛన్ల పెంపుదల విషయంలో ప్రభుత్వం జాప్యం చేస్తుందని ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి కరుణాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షురాలు గట్టు విజయలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన పెన్షనర్ల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయలలో పెన్షన్లు పెంచుతామని ఇచ్చిన హామీ నేటికి అమలు చేయాలేదన్నారు. ఈనెల 8న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టిడికి పెన్షర్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ప్రసాద్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ విజయ్, దుర్గరావు పాల్గొన్నారు.

రిసార్ట్స్ యాజమాన్యంపై చర్య తీసుకోవాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్



మాట్లాడుతున్న రాజేందర్

ఎస్ఎస్‌తాడ్వాయి : హరిత హోటల్‌లో పని చేసిన వర్కర్లకు జీతాలు చెల్లించకుండా ఎత్తేసిన ఫెరియాడో రిసార్ట్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం వర్కర్లతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ పరిధిలో తాడ్వాయి, మేడారం, వాజేడు, ములుగులోని హరితహోటళ్లను ఫెరియాడో రిసార్ట్స్ యాజమాన్యం లీజుకు తీసుకుని ఈనెల 4న రాత్రికి రాత్రే వర్కర్లకు మూడు నెలల వేతనాలు చెల్లించకుండా ఎత్తేసి సామాన్లు సర్దుకొని వెళ్లిపోయిన ఎండీ సిద్ధార్థ పై తగు చర్యలు తీసుకుని వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వర్కర్లు అరవింద్, అనిల్, ప్రేమ్, రమేష్, భానుప్రకాష్, విజయేందర్‌రెడ్డి, సమ్మయ్య, రాజు, ముకుందం, సమ్మయ్య, పవన్, మౌనిక, స్వాతి , ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లు నిర్మించాలి



గుంతలమయంగా మారిన పందికుంట రోడ్డు

ములుగు రూరల్ : అంతర్గత రోడ్లు నిర్మించాలని సీపీఎం మల్లంపల్లి మండల కమిటీ సభ్యుడు జన్ను దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పందికుంట నుంచి రాంచంద్రాపూర్ వెళ్లే దారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు వెళ్లే దారులు పూర్తిగా గుంతలమయంగా మారి ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మల్లంపల్లి బ్రిడ్జి కూలిపోవడంతో వాహనాలను మళ్లించడంతో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని అన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని అన్నారు. లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని దేవేందర్ హెచ్చరించారు.

రైతులను తప్పుదోవ పట్టిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న ఇర్ప సునీల్

ఎస్ఎస్‌తాడ్వాయి : పంట నష్టం పేరుతో రైతులకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కుమ్మక్కై తప్పుదోవ పట్టిస్తున్నారని తాడ్వాయి మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల లబ్ధికోసం పంట నష్టపరిహారం పేరుతో రైతులకు మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అదే పార్టీకి చెందిన మండల అధ్యక్షుడికి సంబంధించిన 5 ఎకరాల విలువైన భూమిని లాక్కొని కనీసం వారి కుటుంబంలో ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో మేడారం చుట్టుపక్కల ప్రాంతాల రైతుల పంట నష్టపరిహారం చెల్లించాలని నాయకులకు ఎందుకు గుర్తుకు రాలేదన్నారు. స్థానిక ఎన్నికల్లో ఓట్ల కోసం నాయకులు కుట్రలు చేస్తున్నా విషయాన్ని రైతులు గమనించాలన్నారు. పంట నష్ట పరిహార విషయాన్ని మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో నాయకులు రానా రమేష్, చర్పా నేతాజీ, బొప్ప వినోద్, తోలెం కృష్ణ పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న గ్యానం వాసు

వెంకటాపురం(కె) : మండల సమస్యలపై ఈ నెల 6 నుంచి సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ఎదిర నుంచి బర్లగూడెం గ్రామం వరకు రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాద భరితంగా తయారైందని అన్నారు. రోడ్డుకు మరమ్మతు పనులు చేపటాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమ్మరి శ్రీను, కట్ల నర్సింహాచారి పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఏటూరునాగారం: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న టీచర్స్ యూనియన్ నాయకులు



వెంకటాపురం(ఎం) : రాజయ్యను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలో స్టేట్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకను విన్నర్స్ నవోదయ అకాడమీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉత్తమ సేవలను అందించిన ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు వీరభద్రం మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైందని వివిధ వృత్తుకు మూలధారమైన వృత్తి అన్నారు.

వెంకటాపురం(ఎం) : మండల కేంద్రంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు భాషబోయిన రాజయ్యను 1982–83లో అతని దగ్గర 5వ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శాలువాతో సత్కరించారు.

ములుగు రూరల్: జాతీయ ఉపాధ్యాయ దినోత్స వేడుకలు జిల్లాకేంద్రంలో సన్‌రైజర్స్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ పెట్టెం రాజు మాట్లాడుతూ విద్యార్థులు బావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బల్లూరి జనార్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానం చేశారు. పూల మాలలు వేసి ,శాల్వతో సన్మానించారు. అదే విధంగా మండలంలోని ముప్పనపల్లి పాఠశాలలో అబ్బు సతీష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

గండ్ర పరామర్శ

మొగుళ్లపల్లి : మండలంలోని పెద్దకోమటిపల్లి గ్రామానికి చెందిన గడ్డం నారాయణ, ముత్యాల కోటేశ్వర్ కోతుల దాడిలో గాయపడ్డ వారిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆకినపల్లికి చెందిన గండు లింగయ్య, ఇస్సిపేటకు పిన్నింటి లచ్చుమమ్మ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సకాలంలో యూరియా అందించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

ములుగు రూరల్ : రైతులకు సకాలంలో యూరియా అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం కొర్ర రాజు ఆధ్వర్యంలో నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో యూరియా దొరకక రైతులు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. రైతులకు యూరియా అందించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. యూరియా అందించని పక్షంలో రైతులు సాగు చేసిన పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. యూరియా సమస్యపై సెప్టెంబర్ 11న జిల్లాకేంద్రంలో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రత్నం ప్రవీణ్, గుండబోయిన రవిగౌడ్, కొండల్‌రావు, రవిందర్, దేవేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌గ్రిడ్‌లో నిలిచిన నీటిసరఫరా

- మరమ్మతుల్లో అధికారుల జాప్యం
- తాగునీటికి ఇబ్బంది పడుతున్న ప్రజలు



కాలిపోయిన మోటార్లకు రంగులు వేస్తున్న గ్రిడ్ సిబ్బంది

మంగపేట : మండలంలోని కమలాపురం మిషన్ భగీరథ వాటర్‌గ్రిడ్ నుంచి నాలుగు రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో తాగునీటికి మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు గోదావరి నీటిని కమలాపురంలోని వాటర్ గ్రిడ్‌లో శుద్ధి చేసి అక్కడ నుంచి పైప్‌లైన్ ద్వారా మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి గుట్టపై నిర్మించిన వాటర్ ట్యాంకులోకి లిఫ్ట్ చేసి అక్కడ నుంచి మండలంలోని అన్ని గ్రామాలకు పైప్‌లైన్ ద్వారా ట్యాంక్‌లకు పంపించి కుళాయిల ద్వారా ఇంటింటికి తాగునీటి సరఫరా చేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి నీటి సరఫరా నిలిచి పోవడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడింది. పలు గ్రామాల్లో డైరెక్టు పంపింగ్ సిస్టంతో పాటు ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా అవుతున్నా పలు ప్రాంతాలకు ఆయా ట్యాంకుల నుంచి పైప్‌లైన్ లేక పోవడంతో రోజువారి అవసరాలతో పాటు కనీస అవసరాలు తీర్చుకునేందుకు కూడా చుక్కనీరు లేకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య అంతా ఇంతా కాదు. తప్పని పరిస్థితుల్లో దగ్గరలోని వాగులు, చెరువుల నుంచి వచ్చే కాలవ్లోని నీటిని వినియోగించుకోవాల్సి వస్తుందన్నారు. తాగునీటి కోసం పంట పొలాల్లోని వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లాల్సి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



మిషన్ భగీరథ్ వాటర్ గ్రిడ్‌లో నీరులేక ఎండిపోయిన ఫిల్టర్ బెడ్

అధికారుల నిర్లక్ష్యం..

వాటర్ గ్రిడ్‌లో గోదావరి నుంచి వచ్చే నీటిని శుద్ధి చేసే ఫిల్టర్ బెడ్‌లో వినియోగించే 7.5 హెచ్‌పి సామర్థ్యం కలిగిన బ్యాక్ వాష్ మోటార్స్ రెండు కాలిపోవడంతో సంబంధిత అధికారులు మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం చేయడంవల్ల సమస్య ఉత్పన్నమైనట్లు సమాచారం. హఠాత్తుగా మోటారు మొరాయించినా, కాలిపోయినా నీటి సరపరాల్లో ఎలాంటి ఆటంకం కలుగకుండా వెంటనే మరో మోటార్‌ను అమర్చేందుకు సిద్ధంగా ఉండాల్సిన మోటారు కూడా రెండు రోజుల క్రితమే కాలిపోయిందని గ్రిడ్ ఇన్‌చార్జ్ అధికారి పవన్ తెలిపారు. మోటార్ల రిపేరు(వైండింగ్)కు వినియోగించే ఆపిల్ కంపెనీ కాపర్ వైర్ వరంగల్ వెళ్లినా దొరకక పోవడంతో మరమ్మతులు చేయలేక పోయామని గ్రిడ్ సూపర్‌వైజర్ చెబుతున్నాడు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి వాటర్ గ్రిడ్ నుంచి తాగునీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.